క్లుప్తంగా

104 ఉద్యోగుల వినతి



అవనిగడ్డ: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగులు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బుధవారం 104 ఉద్యోగులు ఎమ్మెల్యే సింహాద్రిని కలిశారు. తమ డిమాండ్లు పరిష్కరించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు జి.నాంచారయ్య, డి.పోతురాజు, పి.స్వాతి, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

మోపిదేవి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 26వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పార్వతి తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నందున మండల స్థాయి అధికారులు తమ వద్ద ఉన్న సమాచారంతో తప్పక హాజరు కావాలని సూచించారు.

వైభవంగా కల్యాణోత్సవం



బంటుమిల్లి : మండల పరిధిలోని ఆముదాలపల్లి గ్రామంలో గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకలు, అమ్మవారికి సహస్ర నామ కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. పండితులు సోమశేఖరపల్లి ఈశ్వర శర్మ శిష్య బృందం ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య లక్ష్మీ గణపతి, రుద్ర, దుర్గ సూక్త హోమాలు వైభవంగా నిర్వహించినట్లు ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. రాత్రికి స్వామి ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

రెండు వేల రూపాయల నోటు తీసుకోం

పెట్రోలు బంకులో ఏర్పాటైన బోర్డు



కృత్తివెన్ను: రెండు వేల రూపాయల నోటుకు కాలం చెల్లింది. రూ.2 వేల నోటును రిజర్వుబ్యాంకు ఉపసంహరించు కుంటున్నట్టు ప్రకటన ఇవ్వడంతో ఇప్పుడు ఆ నోటు తీసుకోవడానికి వ్యాపారులు వెనుకాడుతున్నారు. సెప్టెంబరు వరకు చెల్లుబాటులో ఉంటుందని ప్రకటించినా వ్యాపారులు తీసుకోవడం లేదు. ఒకప్పుడు ఎంతో వైభవంగా ఒక వెలుగు వెలిగిన ఈ నోటును ఇప్పుడు ప్రజలు తమ వద్ద ఉంచుకోవడం లేదు. కృత్తివెన్నులోని పెట్రోల్ బంకులో రెండు వేల రూపాయల నోటును తీసుకోమని ఏకంగా నిర్వాహకులు బోర్డు పెట్టడం విశేషం.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొక్కిలిగడ్డ (మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ శాసన సభ్యులు సింహాద్రి రమేష్ బాబు పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు రావాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని వివరించారు.

అరకు విహార యాత్రకు ప్రత్యేక బస్సులు

గుడివాడటౌన్: అరకు వ్యాలీ విహార యాత్రకు ఏపీఎస్ ఆర్టీసీ గుడివాడ డిపో స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జి రాజేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న బస్సు బయలుదేరుతుందన్నారు. తుని, నర్సీపట్నం, లంబసింగి, పాడేరు, అరకు, విశాఖపట్నం తదితర ప్రాంతాలను సందర్శించి ఈనెల 29వ తేదీ ఉదయం 6 గంటలకు తిరిగి బస్సు గుడివాడ చేరుకుంటుందన్నారు. 27 ఉదయం లంబసింగి, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, పాడేరు, మోదుకొండమ్మ దేవాలయం, చాపారయి వాటర్‌ఫాల్స్, అరకు పద్మపురం గార్డెన్స్, 28న అరకు ట్రైబల్ మ్యూజియం, కాఫీ మ్యూజియం, బొర్రాకేవ్స్, కైలాసగిరి, ఆర్‌కే బీచ్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తుందన్నారు. బస్సు చార్జి సూపర్ లగ్జరీ రూ 2,500, ఏసీ ఇంద్ర బస్సు రూ.3,500గా నిర్ణయించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 73829 03299, 91771 01904 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వలంటీర్లకు వందనం కార్యక్రమం
- ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు అవార్డుల ప్రదానం



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మోపిదేవి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపుతో చేపట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి జెడ్పీపాఠశాల ఆవరణలో గ్రామ వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవావజ్ర పురస్కారాల ప్రదానోత్సవం ఎంపీడీవో పార్వతి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ మూటలు మోసే ఉద్యోగులంటూ వలంటీర్లను చంద్రబాబునాయుడు చులకన చేసి మాట్లాడారని గుర్తు చేశారు. వృద్ధులు, లబ్ధిదారులు వలంటీర్లు తమ కన్నబిడ్డల వలే ఆదరిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటా అందించారని, మీకు న్యాయం చేస్తేనే తమకు ఓటు వేసి మరోసారి ఆదరించాలని జగనన్న కోరుతున్నారని తెలిపారు. పథకాలు అందించి ప్రజలను సోమరి పోతులను చేస్తున్నారని, హేళనచేసిన బాబు, నేడు జగనన్నన ఇస్తున్న పథకాలను కొనసాగిస్తామని చెప్పుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. మనకు సత్తాలేదు, గెలవలేమని ఒప్పుకున్న పవన్ కళ్యాణ్ తన వారాహిని ఎవడు ఆపుతాడో చూస్తానన్నాడని, ఇప్పుడు చంద్రబాబే వారాహిని అడ్డుకోవడంతో తుప్పు పట్టి మూలకు చేరిందని విమర్శించారు. ముద్రగడ పద్మనాభాన్ని అవమానించి, వంగవీటి రంగా హత్యకు సహకరించిన వారి పక్కన చేరి జగనన్నను విమర్శించడం ఆయన చిత్త శుద్ధిని తెలియచేస్తుందన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ మాజీ మంత్రి, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్‌కు రాసున్న ఎన్నికల్లో టిక్కెట్టు దక్కదనే భయంతో లేనిపోని రాద్ధాంతాలు చేసి టీడీపీ టిక్కెట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. మండలానికి వచ్చిన ఐదు సేవా రత్న అవార్డులను వలంటీర్లకు అందించి శాలువా కప్పి, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.

సచివాలయాల వారీగా 199 మంది వలంటీర్లను సేవా మిత్రతో సన్మానించారు. దివి మార్కెట్ యార్డు చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరావు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు గుర్రం బసవయ్య, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, కోసూరు అనూష, తుమ్మా సోములమ్మ, మోర్ల జ్యోత్స్న, గరికిపాటి వెంకటేశ్వరావు, చింతా శ్రీనివాసరావు, కొలసాని వెంకట కృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, పీపీసీఎస్ చైర్ పర్సన్‌లు ఆది రాంబాబు, తుటారం కృష్ణ, రెడ్డొతు వెంకట రమణ, గరికిపాటి గోవిందరాజులు, పండలనేని అన్నపూర్ణ, కోసూరు శివనాగమల్లేశ్వరావు, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, రెడ్డొతు రాంప్రసాద్, మత్తి వెంకట సత్యనారాయణ, తోట కృష్ణాంజనేయులు, లింగం జగదీష్‌కుమార్, పార్టీ నాయకులు కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- బర్రంకుల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్, యువనేత వికాస్

గణపేశ్వరం (నాగాయలంక): సంక్షేమ పథకాలను అర్హులకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. నవరత్నాల సంక్షేమాన్ని ప్రజలకు ఉన్నతంగా అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను 98 శాతం అమలు చేసి ప్రజల హృదయాలను దోచుకున్నారని ఎమ్మెల్యే సింహాద్రి చెప్పారు. మండలంలోని గణపేశ్వరం సచివాలయం పరిధిలోని బర్రంకుల గ్రామంలో బుధవారం గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ యువ నాయకుడు, ఆయన తనయుడు సింహాద్రి వికాస్ గ్రామంలో 303 గృహాలను సందర్శించారు. లబ్ధిదారులు ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ రేమాల సుబ్బారావు(బెనర్జి), నియోజకవర్గం సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), సర్పంచి బెల్లంకొండ శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, అధికారులు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

29 నుంచి బ్రహ్మోత్సవాలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి బుధవారం తెలిపారు. 29న స్వామివారిని పెండ్లికుమారుడిగా, 30న సాయంత్రం ధ్వజపట ఊరేగింపు, జూన్ 1న జ్యోతి, 2న ఎదుర్కోలు ఉత్సవం, దివ్య కల్యాణ మహోత్సవం, 3న రథోత్సవం, 4న గ్రామోత్సవం, 5న పుష్పోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆలయంలో రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

డ్రోన్ సర్వే పనులు ప్రారంభం



డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలో డ్రోన్ సాయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద రీ–సర్వే పనులను బుధవారం నగర మేయర్ వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ రీ–సర్వే జరగటం వల్ల నగర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. నగరంలో గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను మార్పు చేసి రోవర్స్, డ్రోన్ ఫ్లై ద్వారా సర్వే చేస్తారన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో 26.67 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ సర్వే జరుగుతుందన్నారు. గురువారాల్లో ఈ సర్వే నిర్వహిస్తారు. దీని వల్ల నగరంలోని ప్రతి ఒక్కరికి వారి స్థలాలు, ఇళ్లు ఎంత కొలతలతో ఉన్నదీ స్పష్టంగా నమోదవుతుందన్నారు. ప్రతి ఒక్కరికి హక్కుపత్రాలు ఇవ్వటం జరుగుతుందని, దీని వల్ల హక్కుపత్రాలతో బ్యాంకు రుణాలు పొందవచ్చని, అవసరమైతే భూములు అమ్ముకునే హక్కు ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, కమిషన్ చంద్రయ్య, ఏసీపీ మల్లిఖార్జున, కార్పొరేటర్లు మాచవరపు రాంప్రసాద్, ఐనం తాతారావు, గోపిశెట్టి సతీష్, యండ్రపాటి నాగేశ్వరరావు, తిరుమలశెట్టి ప్రసాద్, కో–ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, మట్టా తులసీ, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, కొలుసు హరిబాబు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ జవ్వాది రాంబాబు, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు గాజుల భగవాన్, షేక్ మొహమ్మద్‌సాహెబ్, బూరగ రామారావు, ధనికొండ శ్రీనివాసరావు, భాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

- ప్రజల అభ్యర్థనకు స్పందించిన మంత్రి జోగి రమేష్
- మంత్రి ఆదేశాలతో రక్షిత నీటి పథకాలను పరిశీలించిన అధికారులు



పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గూడూరు/పెడన: గూడూరుకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి గూడూరు మీదుగా పైప్‌లైన్ ద్వారా పదుల సంఖ్యలో గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. తమకు కూడా తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేయాలని కొన్ని సంవత్సరాలుగా గూడూరు ప్రజలు పాలకులను అభ్యర్థిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన మంత్రి జోగి రమేష్ తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి రక్షిత నీటిని గూడూరు గ్రామానికి సరఫరా చేయడానికి అవకాశాలు పరిశీలించాలని ప్రజా ఆరోగ్య, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో బుధవారం ప్రజారోగ్య శాఖ సీఈ ఆనందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ రామ్‌నాయక్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గూడూరు మండలంలో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా శుద్ధి అవుతున్న నీటి పరిమాణాలను, ఏయే గ్రామాలకు నీరు సరఫరా అవుతుందన్న విషయాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గూడూరు గ్రామానికి నీరు సరఫరా చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, పార్టీ నాయకులు గొరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, తలుపుల వెంకట కృష్ణారావులు తరకటూరు సమ్మర్ స్టోరేజీ నుంచి ఇతర గ్రామాలకు ఏ విధంగా నీటిని సరఫరా చేస్తున్నారో అదే విధంగా తమ గ్రామానికి నీటిని సరఫరా చేసి ప్రజల దాహార్తి తీర్చాలని కోరారు. గూడూరు గ్రామానికి తాగునీరు సరఫరా చేస్తామని ప్రకటించారు. రక్షిత నీటి పథకం ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పైప్‌లైన్ నిర్మాణ పనుల పరిశీలన

తరకటూరు సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నుంచి పెడన పురపాలక సంఘానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ నిర్మాణ పనులను అధికారుల బృందం పరిశీలించింది. ప్లాను ప్రకారం పైప్‌లైన్ నిర్మాణ పనులు గూడూరు గ్రామం మధ్యలో నుంచి నిర్మించాల్సి ఉండగా పైప్‌లైన్ లీకేజీల కారణంగా రహదారులు ఛిద్రం అవుతున్నాయని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పైప్‌లైన్ నిర్మాణ పనులను గ్రామం వెలుపల లజ్జబండ కాలువ గట్టు వెంబడి నిర్మించడం ద్వారా ఎవరికీ ఇబ్బంది ఉండదని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు ఆ మేరకు పైప్‌లైన్ నిర్మాణంలో మార్పులను ఆమోదిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి జోగి రమేష్ ఓఎస్‌డీ దారా శ్రీనివాస్, పెడన మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఖాజా, ఫ్లోర్ లీడర్ కటకం ప్రసాద్, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల రఘు, నాయకులు మతిన్‌ఖాన్, మురాల వెంకటప్పయ్య, లింగం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చివేశారని బాధితుల నిరసన

చర్యలు చేపడతాం : ఆర్ అండ్ బీ డీఈఈ వరలక్ష్మి



కూల్చిన ఇంటి శిథిలాలు చూపిస్తున్న బాధితుడు ఆళ్ల నాగమురళి

చల్లపల్లి: గ్రామంలోని ఆర్‌అండ్‌బీ శాఖ అతిథి గృహం పక్కన స్థలం కొనుగోలు చేశామని, ఇళ్లు ఖాళీ చేయాలని కొంతమంది వ్యక్తులు రోజూ అర్ధరాత్రి తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆళ్ల నాగ మురళి, ఆళ్ల స్వర్ణకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చే యాలని బుధవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో నిరసన దీక్ష చేపట్టారు. తమపై దౌర్జన్యం చేస్తున్న వారికి టీడీపీ నేతలు మద్దతుగా నిలిచి భయపెడుతున్నారని స్వర్ణకుమారి తెలిపారు.

బాధితులకు పలువురి మద్దతు..

బాధితుల నిరసన దీక్షకు పలువురు మద్దతు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పాగోలు ఎంపీటీసీ సభ్యులు మేకా సత్యన్నారాయణ ప్రసాద్ (బంగారుబాబు) తదితరులు అండగా ఉంటామనీ, ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

పరిశీలించిన డీఈఈ

ఆర్ అండ్ బీ శాఖ డీఈఈ వరలక్ష్మి బంగ్లా ఆవరణ పరిశీలించి ఫెన్సింగ్ తొలగించి, రోడ్డు, పైప్‌లైన్ ధ్వంసానికి కారకులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలోకి అనుమతి లేకుండా ఎవరూ రాకూడదని ప్రకటించి, గేటు మార్గానికి తాళాలు వేయించారు.

ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సత్కారం



పురస్కారం అందుకున్న వలంటీర్లతో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

అవనిగడ్డ: మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంకలో వలంటీర్లకు సేవాపురస్కారాలు అందజేశారు. బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఒకరికి సేవారత్న, 9 మందికి సేవా మిత్ర పురస్కారాలను ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈవో యలవర్తి రమాకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సింహాద్రి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాషా, పలువురు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్రీడలు సమైక్యతకు దోహదం



విజేత జట్లతో ఎంపీపీ రామిశెట్టి, దూలం శ్యామ్

ముదినేపల్లిరూరల్: క్రీడలు మానసికోల్లాసంతో పాటు వివిధ వర్గాల మధ్య సమైక్యతకు దోహదం చేస్తాయని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత దూలం వీరశ్యామ్ ఫణికుమార్ అన్నారు. ముదినేపల్లిలో నిర్వహించిన డీఎన్నార్ ప్రీమియర్ క్రికెట్ లీగ్–టెన్నిస్‌బాల్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేత జట్లకు ఎంపీపీ, దూలం ఫణి మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. సిరీస్‌లో మొదటి బహుమతి పొందిన కలిదిండి డీఎన్నార్ టీమ్‌కు రూ.50 వేలు అందజేశారు. మిగతా టీమ్‌లు వరుసగా సింగరాయపాలెం లోకనాథ్‌సింగ్ టీమ్‌కు రూ.30 వేలు, వడ్లమన్నాడు చందు టీమ్‌కు రూ.20 వేలు, ముదినేపల్లి సతీష్ టీమ్‌కు రూ.10వేలు అందజేశారు. మ్యాన్ ఆఫ్‌ది సిరీస్‌గా జి.రాంబాబుకు రూ.10 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మ్యాన్‌గా వడాలి టీమ్‌కు చెందిన గోపాల్‌కు రూ.5 వేలు, బెస్ట్ బౌలర్‌గా సింగరాయపాలెం టీమ్‌కు చెందిన అశోక్‌కు రూ.5 వేలు, బెస్ట్ ఫీల్డర్‌గా వడాలి టీమ్‌కు చెందిన భార్గవ్‌కు రూ.5 వేలు అందజేసి విజేత జట్లను అభినందించారు. వైస్ ఎంపీపీ రాచూరి రాధా, ఎస్ఐ షణ్ముఖసాయి వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, వెంకటేశ్వరరావు, పల్లి శ్రీధర్, గూడపాటి వరప్రసాద్, దివి సతీష్, నాని, పృథ్వీ, సిరీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

పామర్రు: ఉండ్రపూడి – పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.8,50,562లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఈవో మాట్లాడుతూ.. దేవదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సమక్షంలో హుండీలను లెక్కించామన్నారు. రెండు నెలల 10 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో కొనసాగుతున్న శిక్షణ



మచిలీపట్నంటౌన్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగా, ధ్యానం, భగవద్గీత శ్లోకాల పఠనం, కథలు చదివించటం, చెప్పటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈడేపల్లి గ్రంథాలయంలో విద్యార్థులకు మాస్టర్ శేషగిరిరావు డ్రాయింగ్ నేర్పించారు. ఉపాధ్యాయుడు వీరభద్రరావు స్పోకెన్ ఇంగ్లిషు నేర్పారు. యోగా మాస్టర్ గురునాథ్ విద్యార్థులతో ప్రాణాయామాలు, మెడిటేషన్ చేయించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కన్వీనర్ ఎం.లక్ష్మీకాంతం దత్తస్తవం, దక్షిణామూర్తి శ్లోకాలు నేర్పారు. చిలకలపూడి గ్రంథాలయంలో యోగా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాలను ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో అనగాని వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాయపాలెం రైల్వేగేటు వద్ద బుధవారం వాహనదారులు, ప్రజలకు మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేగేటు పడిన సమయంలో వాహనాల ఇంజన్లు ఆపివేయడం వలన ఇంధనం పొదుపుతో పాటు వాతావరణంలో వేడి తగ్గుతుందన్నారు. చెట్లను పెంచడం వల్ల పర్యావరణానికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ, జనార్దనరావు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు దోహదం

గుడివాడటౌన్: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను తగ్గించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని టూటౌన్ సీఐ తులసీధర్ అన్నారు. స్థానిక కాకర్లవీధిలో సిరిపల్లి చంద్రశేఖర్, మానం ఫణికుమార్, గణపతి కొండలరావు, తోట తిరుమలరావు, గాంధి, గోపిల వితరణలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ తులసీధర్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు పట్టణంలో పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి దాతలను సన్నద్ధం చేస్తున్నామన్నారు. దాతలను అభినందించారు.

కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తోట్లవల్లూరు: వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలను అవ్వా,తాతలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేవరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం బుధవారం జరిగింది. ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, సీహెచ్ఓ సోనిక, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, ఎంపీహెచ్ఏ నందీశ్వరరావు, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు అరుణ, సలోమి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలకు క్యాంపెయిన్



పెదప్రోలు(మోపిదేవి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటుందని మోపిదేవి జెడ్పీపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన పది ఫలితాల్లో 55 మార్కులు పైగా 9 మంది సాధించారని గుర్తు చేశారు. అత్యధికంగా మేడికొండ మోనా 578 మార్కులు, అర్జా అక్షయ 569 మార్కులు, నడకుదుటి రాజేష్ 551 మార్కులు సాధించారని వివరించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో బాలికలను చేర్పించేందుకు విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించే సౌకర్యాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించి ఆసక్తి కలిగిన వారికి అడ్మిషన్ పత్రాలను అందచేశారు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలలోని ప్రధాన క్రైస్తవ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పంచాయతీ ఆధ్వర్యంలో పొక్లెయిన్ ద్వారా జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల నుంచి జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను ఉప సర్పంచ్ ఐనపూడి భానుప్రకాష్, గొర్రెపాటి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఐ సెట్ పరీక్ష

పెడన: ఐ సెట్ 2023 పరీక్ష నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్లో జరిగిన పరీక్షకు 130 మందికి 130 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 130 కి 125 మంది హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ఎస్‌రెడ్డి, పరీక్ష కేంద్రం అడ్మిన్ పి. అశోక్ కుమార్ తెలిపారు.